యువకుల్లో నోటి క్యాన్సర్ ఆందోళనకరం

అవగాహన కార్యక్రమ లోగోను ఆవిష్కరిస్తున్న ఆంకాలజిస్ట్ నోరి దత్తాత్రేయుడు, సినీ నటుడు రాజా రవీంద్ర, డాక్టర్ దిలీప్

బంజారాహిల్స్, జూలై 7(ఆంధ్రజ్యోతి) : నోటి క్యాన్సర్‌ను తరిమేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ప్రముఖ ఫేషియల్ సర్జన్ దిలీప్ అన్నారు. గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ద్వారా చేస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఆయన బంజారాహిల్స్‌లో ప్రముఖ భారతీయ రేడియేషన్ ఆంకాలజిస్ట్ నోరి దత్తాత్రేయుడితోపాటు సినీ నటుడు రాజా రవీంద్రను కలిశారు. అవగాహన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిలీప్ మాట్లాడుతూ గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ద్వారా ప్రతియేటా ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 21 ఏళ్ల యువకుడికి కూడా నోటి క్యాన్సర్ రావడం చూస్తుంటే పరిస్థితి భయంకరంగా ఉందన్నారు. ప్రముఖ వైద్యులతో పాటు సినీ తారలు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు తమ సంస్థ కార్యక్రమాలకు మద్దతు తెలిపి అవగాహన కల్పించాలని కోరారు.

కంపెనీ రహస్యాలు చోరీ చేశారు

● మాజీ, ప్రస్తుత ఉద్యోగులపై పోలీసులకు ఐటీ సంస్థ ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ప్రముఖ ఇంజనీరింగ్, డిజైన్ సేవల సంస్థ ఈవీ గేట్‌వే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన గోప్యమైన వ్యాపార సమాచారం, ఇంజనీరింగ్ డ్రాయింగులు, ప్రాజెక్టు వివరాలు, సోర్స్ కోడ్, ఉద్యోగుల సమాచారం అక్రమంగా ప్రత్యర్థి సంస్థకు చేరవేసి కోట్ల రూపాయల వ్యాపార నష్టానికి కుట్ర పన్నారనే ఆరోపణలపై సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ ఈవీ గేట్‌వే ఇండియా ఆపరేషన్స్ హెడ్ ఉదయ్ కుమార్‌రెడ్డి చాగరి, ప్రస్తుతం సంస్థలో పని చేస్తున్న మురళీకృష్ణ గోన్, మాజీ ఐటీ కన్సల్టెంట్ ప్రదీప్ కూచన, రెనిలియంట్ గ్రిడ్ సిస్టమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్‌జీఎస్ఐ), అమెరికాకు చెందిన గ్రావిటీ ఎనర్జీ సంస్థకు చెందిన వ్యక్తులు, మరో మాజీ ఉద్యోగి నిశాంత్ కలిదిండి తదితరులు కలిసి పథకం ప్రకారం సంస్థ రహస్యాలను దుర్వినియోగం చేశారని ఈవీ గేట్‌వే ఇండియా సంస్థ హెడ్ హెచ్ఆర్ శ్రీకాంత్ శర్మ మల్లాడి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో ఈమెయిల్స్, వాట్సాప్ సందేశాలు, క్లౌడ్ డేటా, మొబైల్ ఫోన్లు, డిజిటల్ రికార్డులు కీలక ఆధారాలుగా ఉన్నాయని, వెంటనే చర్యలు తీసుకోకపోతే వాటిని ధ్వంసం చేసే అవకాశముందని పేర్కొన్నారు.

ఘనంగా ధోనీ జన్మదిన వేడుకలు

రక్తదానం చేస్తున్న అభిమానులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి) : భారత క్రికెట్ దిగ్గజం, టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ 45వ పుట్టిన రోజును పురస్కరించుకుని హైదరాబాద్‌లో తెలుగు ఎంఎస్‌డియన్స్ ఫ్యాన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో సీఓఓ ఆర్.స్వామి నాయుడు సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 500 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఉప్పల్ స్టేడియంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ వి.ఆగంరావు, సభ్యులు సి.సంజీవ్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటి, తెలుగు ఎంఎస్‌డియన్స్ సభ్యులను అభినందించారు. అనంతరం సికింద్రాబాద్‌లోని ఒక అనాథాశ్రమంలో పిల్లలకు క్రీడా సామగ్రి, వంట వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఎంఎస్‌డియన్స్ అధ్యక్షుడు ప్రవీణ్ బలును, ఉపాధ్యక్షుడు ఎస్.సంజయ్, అశోక్, శ్రీకాంత్, విల్సన్, కిషోర్, చరణ్, పవన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా వైన్ తయారీ.. ముగ్గురి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూలై 7(ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెట్టుగూడ, తార్నాక ప్రాంతాల్లో.. అనుమతి లేకుండా అంగ్లో ఇండియన్లు వైన్ తయారు చేస్తున్నారనే సమాచారంతో సికింద్రాబాద్ డీటీఎఫ్ సీఐ సౌజన్య, సిబ్బంది రెండు చోట్ల దాడులు నిర్వహించారు. 25 వైన్ బాటిళ్లు, 20 లీటర్ల వైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఆంటోని, వేణు, ప్రకాష్‌ను అరెస్టు చేశారు.

ప్రశ్నార్థకంగా మెట్రోరైలు భవితవ్యం

● బీఆర్ఎస్ ఎల్పీ విప్ వివేకానందగౌడ్

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్రానికి ప్రేమ లేఖలతో సీఎం టైమ్ పాస్ చేస్తున్నారని, దీంతో సౌకర్యంతో కూడిన ప్రయాణ సాధనమైన మెట్రో రైలు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని బీఆర్ఎస్ఎల్పీ విప్ కేపీ వివేకానందగౌడ్ అన్నారు. రేవంత్‌రెడ్డి నిర్ణయాలు ప్రజలకు శాపంగా పరిణమించాయని ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మెట్రోరైల్‌పై కేంద్ర మంత్రితో సీఎం ఏం చర్చలు చేశారో ప్రజలకు చెప్పలేదని, బడే భాయ్, చోటే భాయ్ కలిసి మెట్రోను మడత పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 40లక్షల జనాభా ఉన్న జైపూర్‌లో మెట్రో ఫేజ్2కు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ.. 1.30 కోట్ల జనాభా ఉన్న హైదరాబాద్ నగరానికి మెట్రో ఫేజ్-2 ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలన్నారు. చేతగాని దద్దమ్మ సీఎం పాలనలో హైదరాబాద్ ఆగమైందని, నగర అభివృద్ధి విషయంలో కాంగ్రెస్, బీజేపీ ఫెయిల్ అయ్యాయని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వ జీఓ ఏపీ పేరుతో వచ్చిందని.. ఇంతకంటే దిక్కుమాలిన పాలన ఎక్కడా ఉండదని అన్నారు.

హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చడమే లక్ష్యం

● మంత్రి పొన్నం ప్రభాకర్

షటిల్ సర్వీసులను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మధుయాష్కి

రాయదుర్గం, జూలై7(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తూ అమలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జేఆర్సీ కన్వెన్షన్‌లో మంగళవారం ఐటీ ఉద్యోగుల కోసం డైలీ షటిల్ సర్వీసులను టీపీసీసీ ప్రచారక కమిటీ చైర్మన్ మధుయాష్కితో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లాస్ట్ మైల్ కనెక్టివిటీ పేరుతో మెట్రో, రైల్వే, ఆర్టీసీ ద్వారా కిందిస్థాయి వరకు రవాణా సౌకర్యాలు మెరుగుపరిచే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదన్నారు. నగరంలో ఈవీ వాహనాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ఆర్టీసీ కొత్తగా 350 రూట్‌లలో బస్సులు నడుపుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు రిఫ్లెక్టర్ సిస్టం తీసుకొస్తున్నామని చెప్పారు.

చెరువులు, కాలువలు కాపాడితే ముంపు ముప్పు ఉండదు

● ముస్సోరిలో ఐఏఎస్‌ల శిక్షణలో రంగనాథ్

మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నగరాలు అభివృద్ధి చెందుతున్న క్రమంలో చెరువులు, వరద నీటి కాలువలు ఆక్రమణకు గురి కాకుండా కాపాడితే వరద ముంపును నియంత్రించవచ్చని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమి ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్‌బీఎస్ఎన్ఏఏ)లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పట్టణాభివృద్ధి, పరిపాలన, పట్టణ ప్రణాళికా విభాగాల్లో పని చేస్తున్న ఐఏఎస్ అధికారుల సామర్థ్యాభివృద్ధి శిక్షణలో మంగళవారం ఆయన మాట్లాడారు. 'నగరాల్లో వరద ముంపు తప్పించడం - విపత్తు నిర్వహణ వ్యూహాలు అనే అంశంపై వివరించారు. పర్యావరణ పరిరక్షణ, వరదలు, విపత్తుల నిర్వహణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రా తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలిపారు. గత రెండేళ్లలో ఆక్రమణలు తొలగించి 2471 ఎకరాల భూమిని హైడ్రా కాపాడిందని చెప్పారు. ఇతర రాష్ట్రాలు, నగరాల్లోనూ హైడ్రా లాంటి సంస్థల ఏర్పాటుకు డిమాండ్లు వస్తున్నాయని రంగనాథ్ తెలిపారు.

వంతెనల వద్ద నీటి మట్టాలపై నిరంతర నిఘా

వర్షాకాల సన్నద్ధతపై దక్షిణ మధ్య రైల్వే జీఎం సమీక్ష

మాట్లాడుతున్న శ్రీవాస్తవ

హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో ప్రమాదం పొంచి ఉన్న అన్ని ప్రదేశాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని దక్షిణమధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ రైల్వే ఉన్నతాధికారులను ఆదేశించారు. వంతెనల వద్ద నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. జోన్ పరిధిలో వర్షాకాలంలో చేపట్టాల్సిన చర్యలపై సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లకు చెందిన డీఆర్ఎంలు, ఇతర సీనియర్ అధికారులతో శ్రీవాస్తవ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సురక్షితమైన పని పద్ధతులను పాటించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. గ్రూప్ సమావేశాలు, వ్యక్తిగత కౌన్సెలింగ్ సెషన్‌ల ద్వారా లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లకు క్రమం తప్పకుండా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇండియన్ రైల్వేస్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ కోసం నిర్దేశించిన ప్రామాణిక కార్యాచరణ పాటించాలన్నారు.

హెచ్‌సీయూలో ప్రవేశాలకు ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : యూజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సుల్లో (2026-27) ప్రవేశాలకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. కామన్ యూనివర్సిటీస్ ఎంట్రన్స్ టెస్ట్ (సీఈయూటీ)-2026 స్కోరు ఆధారంగా ప్రవేశాలు ఉంటాయని అధికారులు చెప్పారు. అభ్యర్థులు జూలై 7నుంచి 21 వరకు విశ్వవిద్యాలయం అధికారిక అకడమిక్ పోర్టల్ (*https://uohyd.ac.in*)లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 17నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, మొత్తం 17రకాల కోర్సుల్లో 470 సీట్లు ఉన్నట్లు చెప్పారు.

నగరంలో చిరు జల్లులు

హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలో మంగళవారం రాత్రి పలు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. రాజేంద్రనగర్, బండ్లగూడ, ఖైరతాబాద్, బాలానగర్, సరూర్‌నగర్, ఉప్పల్, కూకట్‌పల్లి, హయత్‌నగర్, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో మోస్తరు జల్లులు పడడంతో వాతావరణం చల్లబడింది. మరోరెండు రోజులు నగరంలో తేలికపాటి జల్లులు కురిసే అవకాశాలుంటాయని బేగంపేట వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

అంబేడ్కర్ వర్సిటీలో బీఎడ్ అర్హత పరీక్ష నోటిఫికేషన్

హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బీఎడ్ (ఒ.డి.ఎల్) అర్హత పరీక్షకు (2026-27) నోటిఫికేషన్ విడుదలైంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ జూలై 24 అని విశ్వవిద్యాలయ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు విశ్వవిద్యాలయ పోర్టల్ (*https://braou.ac.in*) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రుసుము రూ. 1000 కాగా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.750గా నిర్ణయించారు. ఆగస్టు 2వ తేదీన అర్హత పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించారు. మరిన్ని వివరాలకు హెల్ప్ డెస్క్ నంబర్ 040- 23680333/555ను సంప్రదించాలని సూచించారు.

బార్ డ్యాన్సర్ ఆత్మహత్యపై అనుమానాలు !

మృతి చెందిన రేణుక (ఫైల్)

కార్వాన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజుల క్రితం లంగర్‌హౌజ్ హోటల్ గ్రాండ్ లాడ్జిలో బార్ డ్యాన్సర్ ఆత్మహత్య చేసుకున్న కేసులో మృతురాలి బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రేణుక ఆత్మహత్య చేసుకొనేంత పిరికి కాదంటున్నారు. లంగర్‌హౌజ్‌లోని హోటల్ గ్రాండ్ లాడ్జి నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని, షారుఖ్ అనే వ్యక్తి, రేణుక కలిసి లాడ్జిలోని రూమ్ అద్దెకు తీసుకున్నారని ఆరోపించారు. రేణుక ఆత్మహత్య చేసుకుంటున్న సమయంలో షారుఖ్ రూమ్‌లో లేకపోవడం అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. ఎవరైనా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా అన్న సందేహం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా విద్యాసాగర్

చిన్నారెడ్డి సమక్షంలో విద్యాసాగర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న బదిలీ అయిన దివ్య దేవరాజన్

బేగంపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా కె.విద్యాసాగర్ మంగళవారం ప్రజావాణి ఇన్‌చార్జి జి. చిన్నారెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు నోడల్ అధికారిగా పనిచేసిన దివ్య దేవరాజన్ పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌గా బదిలీ కావడంతో విద్యాసాగర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్, దివ్య దేవరాజన్‌కు చిన్నారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫెడరేషన్ ఆఫ్ స్వీట్స్ అండ్ నంకీన్ మాన్యుఫ్యాక్చరర్స్ డైరెక్టర్ జనరల్ ఫిరోజ్ హెచ్.నక్వీ తదితరులు

16న వరల్డ్ మిఠాయి నంకీన్ కన్వెన్షన్

బంజారాహిల్స్, జూలై 7(ఆంధ్రజ్యోతి) : దేశంలో సుమారు రూ.1.5 లక్షల కోట్ల విలువైన మిఠాయి నంకీన్ పరిశ్రమకు సంబంధించిన అతిపెద్ద వ్యాపార సమ్మేళనం వరల్డ్ మిఠాయి నంకీన్ కన్వెన్షన్ - 2026 పర్చేజింగ్ ఎడిషన్‌కు నగరం వేదికగా మారనున్నది. జూలై 16 నుంచి 18 వరకు మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగనున్న సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం బంజారాహిల్స్‌లోని ఓ హోల్‌లో ఫెడరేషన్ ఆఫ్ స్వీట్స్ అండ్ నంకీన్ మాన్యుఫ్యాక్చరర్స్ డైరెక్టర్ జనరల్ ఫిరోజ్ హెచ్. నక్వీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో 300కు పైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటారని, 30 వేలకుపైగా వ్యాపారులు సందర్శిస్తారని తెలిపారు. ముడి పదార్థాలు, డ్రైఫ్రూట్స్, నట్స్, ఫుడ్ ఇంగ్రీడియంట్స్, ఫ్లేవర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ ఇలా అనేక వ్యాపార లావాదేవీలు ఇక్కడే జరుగుతాయన్నారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఎన్ఎం సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మల్లి బాబు, పారిశ్రామికవేత్తలు హేమంత్ గెహ్లోట్, దొర రాజు, కల్నల్ భాస్కర్, ఇమ్తియాజ్ సిద్ధిఖీ, జితేష్ వఖారియా తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎత్తివేసే కుట్ర

లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద విద్యార్థుల నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య, బీసీ సంఘాల నేతలు

కవాడిగూడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పథకాన్ని ప్రభుత్వం ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు,. రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా సీఎం రేవంత్‌రెడ్డి పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్ పటేల్, బీసీ నిరుద్యోగుల జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, నాయకులు శివకుమార్‌యాదవ్, అనంతయ్య, జిల్లపల్లి అంజి, రాజేందర్, భీంరాజ్, వినోద్, బాలయ్య, ఉమేష్‌యాదవ్, వంశీమోహన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ సీపీ శ్రీనివాసులు

హైదరాబాద్ సిటీ, జూలై 7(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌ను సిటీ క్రైమ్ అండ్ సిట్ అడిషనల్ సీపీ ఎం. శ్రీనివాసులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరును సమీక్షించారు. తనిఖీ సమయంలో సైబర్ క్రైమ్స్ డీసీపీ వి. అరవింద్ బాబు, ఏసీపీ శివమారుతి ఉన్నారు. సిబ్బంది క్రమశిక్షణ, విధి నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న అబ్దుల్ ముకీత్ చందాతోపాటు అతిథులు

వివాహ ఖర్చు తగ్గించుకున్నారు.. విద్యార్థులకు సాయమందించారు..!

హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వివాహమంటేనే భారీ ఖర్చుతో కూడిన వేడుకగా మారిందిప్పుడు. ఆ ఖర్చును తగ్గించుకొని ఆదర్శప్రాయమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త అబ్దుల్ ముకీత్ చందా. తన కుమారుడి వివాహాన్ని ఇటీవల నాంపల్లిలోని మస్జిద్-ఏ-బాఫేలో నిరాడంబరంగా నిర్వహించి, వివాహం కోసం కేటాయించిన డబ్బును ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు విరాళంగా అందించారు. సర్ సయ్యద్ మైనారిటీస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో " గిఫ్ట్ ఎ స్మైల్ " పేరిట సుమారు రూ. 50 లక్షల స్కాలర్‌షిప్‌లను 300 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. అబ్దుల్ ముకీత్ చందా ఉదారతను పలువురు విద్యావేత్తలు, రాజకీయ నాయకులు ప్రశంసించారు.

బాస్ పేరిట వాట్సాప్ మెసేజ్

● హనర్ బిల్డర్స్‌కు రూ.4.70 కోట్ల టోకరా!

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న 'బాస్ స్కామ్' మరోసారి హైదరాబాద్‌లో వెలుగు చూసింది. హనర్ బిల్డర్స్‌కు చెందిన రియల్ ఎస్టేట్ సంస్థను నమ్మించి సైబర్ నేరగాళ్లు రూ.4.70 కోట్లు కొల్లగొట్టారు. గత నెల 30న హనర్ అర్బన్ హోమ్స్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సుధాకర్‌కు.. సంస్థ ఎండీ స్వప్నకుమార్ పేరుతో, ఆయన ఫొటో (డీపీ) ఉన్న వాట్సాప్ నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. తమ సంస్థలైన హనర్ అర్బన్ హోమ్స్, హనర్ రియాల్టీకి సంబంధించిన బ్యాంకు బ్యాలెన్స్ ఎంత ఉందో పంపించమని అందులో అడిగారు. ఎండీ అడిగారని నమ్మిన సుధాకర్ ఆ వివరాలు పంపారు. కొద్దిసేపటికే 'లక్ష్మీ సాయిశ్రీ టీఆర్‌డీ ఇన్‌ఫ్రా' ఖాతాకు రూ.1.80 కోట్లు బదిలీ చేయాలని ఆదేశాలు వచ్చాయి. బాస్ ఆదేశాలే అని నమ్మిన సుధాకర్ వెంటనే ఆ మొత్తాన్ని బదిలీ చేశారు. 24 గంటల తర్వాత జూబ్లీహిల్స్‌లోని 'రచనా టెక్నాలజీస్'కు రూ.2.90 కోట్లు బదిలీ చేయాలని మేసేజ్ రావడంతో సుధాకర్ ఆ డబ్బును కూడా పంపించేశారు. ఆ తర్వాత జరిగిన లావాదేవీల గురించి సుధాకర్ సంస్థ సీఎఫ్ఓకు తెలపడంతో, అనుమానం వచ్చి ఎండీని నేరుగా అడిగి నిర్ధారించుకొమ్మని సూచించారు. దీంతో సుధాకర్ స్వప్న కుమార్‌కు ఫోన్ చేయగా, తాను ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదని, అసలు ఆ వాట్సాప్ నంబర్ తనది కాదని స్పష్టం చేశారు. మోసపోయామని గుర్తించిన బాధితులు వెంటనే సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల మూసివేత తగదు

● సీఎం రేవంత్‌కు విద్యావేత్తలు, మేధావుల బహిరంగ లేఖ

సీఎంకు బహిరంగ లేఖ విడుదల చేస్తున్న హరగోపాల్, చంద్రకుమార్ తదితరులు

హైదరాబాద్/ రాంనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలలను నాలుగు వేలకు కుదిస్తామంటూ సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల బెంగళూరులో చేసిన ప్రకటనపై రాష్ట్రంలోని ప్రముఖ విద్యావేత్తలు, మేధావులు, కవులు, ప్రజాసంఘాల నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎం తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం మీడియా సమావేశంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని, 100 మందికి పైగా మేధావులు సీఎంకు రాసిన బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. పాఠశాలల మూసివేత ప్రకటన పౌర సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రవేశపెట్టాలని.. మౌలిక వసతులు కల్పిస్తూ, సరిపడా టీచర్లను నియమించాలని సేవ్ ఎడ్యుకేషన్ సంస్థ అధ్యక్షుడు అశోక్ కుమార్ పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గుతుందనే నెపంతో పాఠశాలల మూసివేత నిర్ణయం సరైంది కాదని జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ పాత్రికేయుడు కె. రామచంద్ర మూర్తి, న్యాక్ మాజీ చైర్మన్ వీఎస్. ప్రసాద్, ప్రముఖ ఆర్థికవేత్త నరసింహారెడ్డి, మాజీ కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిద్ధారెడ్డి, డాక్టర్ వనమాల, సినీ నిర్మాతలు సయ్యద్ రఫీక్, శంకర్, అన్వర్ ఖాన్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'లేట్ నైట్ ఈట్స్' ప్రారంభించిన స్విగ్గీ

హైదరాబాద్ సిటీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఆన్- డిమాండ్ కన్వీనియన్స్ ప్లాట్‌ఫామ్, స్విగ్గీ ఇప్పుడు రాత్రి పూట ఉద్యోగాలు చేసే వారి సౌకర్యార్థం ప్రత్యేకంగా 'లేట్ నైట్ ఈట్స్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించింది. రాత్రిపూట ఆహారాన్ని ఆర్డర్ చేయడాన్ని మరింత సులభతరం చేయాలని లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆ సంస్థ స్మార్టజీ, కస్టమర్ ఎక్స్ పీరియన్స్, న్యూ ఇనిషియేటివ్స్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ మాలా తెలిపారు. వర్క్‌స్టేషన్‌కు అనుకూలమైన భోజనాలు, క్విక్ బైట్స్ నుంచి కాఫీలు, డెజర్ట్‌లు, గ్రూప్ ఆర్డర్‌ల వరకు దీని ద్వారా చేసుకోవచ్చని, రాత్రి 10 గంటల తర్వాత ఆఫీస్ ఆర్డర్లు ఏటా పెరుగుతుండటాన్ని గమనించి ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ ...the name you can BANK upon!

SAMB చెన్నై, 4వ అంతస్తు, పిఎన